క్లుప్తంగా

అర్బన్ తహసీల్దార్‌గా స్వామి



స్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

ఖమ్మంఅర్బన్: ఖమ్మంఅర్బన్ తహసీల్దార్‌గా సీహెచ్ స్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా ఉన్న ఎం.శైలజను బదిలీ చేశారు. మధిర తహసీల్దార్‌గా ఉన్న స్వామి అర్బన్‌కు కేటాయించడంతో బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు ఆర్‌ఐలు రవి, రమేష్, కార్యాలయ సిబ్బంది స్వామిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో నూతనంగా నిర్మించనున్న ముత్యాలమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు సోమవారం రూ.30 వేల విరాళం కమిటీ ప్రతినిధులకు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కుమ్మరి వీరబాబు, సలవాది శ్రీను, కుమ్మరి పుల్లయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక – రేగులచలక గ్రామంలో నూతనంగా నిర్మించనున్న పునీత జోజప్ప దేవాలయానికి కాపాంటి రామచంద్రయ్య సరస్వతిలు రూ.25 వేల రూపాయలు అందించినట్లు కమిటీ బాధ్యులు నాగేశ్వరరావు తెలిపారు.

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 18, 31, 33 డివిజన్లతో పాటు సాయంత్రం 46వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. అలాగే, ఉదయం 11 గంటలకు మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగిస్తారు. అంతే కాకుండా సాయంత్రం 4.30 గంటలకు క్యాంపు కార్యాలయంలో సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులు, లెర్నింగ్ లైసెన్సులు పంపిణీ చేయనున్నారు.

మంత్రిని కలిసిన కమల్‌రాజ్



మంత్రి పువ్వాడతో కమల్‌రాజ్

ఖమ్మంమయూరిసెంటర్: జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు సోమవారం రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఖమ్మంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాలో మధిర నియోజకవర్గం నుంచి కమల్‌రాజ్ పేరు వెల్లడించిన నేపథ్యాన ఆయన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రఘువరన్ బీటెక్, గదర్
వినోద	జైలర్
సాయిరాం	జైలర్, డీడీ రిటర్న్స్
ఆదిత్య	పిజ్జా
శ్రీనివాస	భోళాశంకర్
సుందర్	మిస్టర్ ప్రెగ్నెంట్, ప్రేమ్‌కుమార్

– ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	46	బచ్చలికూర	5
వంకాయ	46		20
బెండకాయ	30	పాలకూర	4
పచ్చిమిర్చి	58		20
కాకర	36	చుక్కకూర	4
బీర	38		20
దొండ	36	తోటకూర	5
పొట్లకాయ	36		20
చిక్కుడు	60	గోంగూర	4
గోరుచిక్కుడు	46		20
క్యాబేజీ	28	మెంతికూర	4
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	46		20
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	66		20

–ఖమ్మం వ్యవసాయం

లింకు రోడ్లకు మహర్దశ

పాలేరులో రహదారుల నిర్మాణానికి రూ.14.52 కోట్లు

- త్వరలోనే మొదలుకానున్న పనులు
- తీరనున్న ప్రజలు, రైతుల కష్టాలు

కూసుమంచి: దశాబ్దాల తరబడి ఇరుకు దారులు, వర్షం వస్తే కనీసం నడవలేని పరిస్థితి.. దారంతా బురదమయం.. రైతులకు, విద్యార్థులకు అగచాట్లు.. ఇలాంటి దారుల్లో ఇన్నాళ్లు ప్రజలు నరక యాతన పడగా ఇప్పుడు ఈ రహదారులకు మహర్దశ పట్టనుంది. దారులన్నీ త్వరలో బీటీగా మారనుండడంతో ఏళ్ల నుంచి పడుతున్న కష్టాలు తీరనున్నాయి. పాలేరు నియోజకవర్గంలో పలు గ్రామాల మధ్య ఉన్న లింక్ రోడ్ల అభివృద్ధికి రూ.14.52 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయా గ్రామాల మధ్య 15.05 కిలోమీటర్ల మేర లింకు రోడ్లను బీటీ రహదారులుగా మార్చనున్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయి.

కాలినడక కూడా కష్టమే..

ఇప్పటి వరకు ఈ రహదారులు మట్టి దారులే. దీంతో పాటు పొలాల మధ్య ఇరుకుగా డొంకదారుల్లా ఉండటంతో ప్రజలకు కనీసం కాలినడక కూడా కష్టంగా మారి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక వర్షం వస్తే ఈ దారిలో అడుగు కూడా వేయలేని పరిస్థితి. ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ దారుల్లో ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలతో పాటు రైతులకు, విద్యార్థులకు ఈ దారుల్లో ప్రయాణం ప్రతినిత్యం నరకయాతనే.

రైతులకు మేలు..

నియోజకవర్గంలో 8 లింకు రోడ్లను బీటీ రహదారులుగా మారుస్తుండగా ఈ రహదారుల వలన ఆయా గ్రామాల ప్రజలతో పాటు రైతులకు ప్రయోజనం కలుగనుంది. ఇప్పటి వరకు ఇరుకుగా, బురదగా మారిన దారుల్లో అష్టకష్టాలు పడుతూ వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులకు ఈ రహదారులు వెడల్పుగా మారి బీటీగా మారనున్నాయి. దీంతో రైతులకు కష్టాలు తప్పనున్నాయి. దీంతో పాటు ఇప్పటి వరకు వ్యవసాయ పొలాలకు దారి సమస్యతో పాటు వివాదాలు జరుగుతుండగా రహదారుల నిర్మాణంతో బాధలు తొలగిపోనున్నాయి.



అధ్వానంగా ఉన్న గట్టుసింగారం - లింగారం తండా లింకు రోడ్డు



లింగారం తండా-గన్యాతండా మధ్య ఇలా..

మంజూరైన రహదారులు..

- కూసుమంచి మండలం తురకగూడెం నుండి కిష్టాపురం వరకు 1.20 కి.మీ. రహదారికి రూ.1.08 కోట్లు, తురకగూడెం–చింతలతండాకు రూ.1.80 కోట్లు, లింగారం తండా–గట్టుసింగారం 2 కి.మీ. రోడ్డుకు రూ.1.85 కోట్లు, లింగారం తండా – గన్యాతండా 0.90 కి.మీ. రోడ్డు అభివృద్ధికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి.
- నేలకొండపల్లి మండలం రాయిగూడెం–మంగాపురం తండా 2.22 కి.మీ.కి రూ.2.22 కోట్లు, రాజారంపేట– బుద్దారం 0.85 కి.మీ.కు రూ.85లక్షలు మంజూరయ్యాయి.
- తిరుమలాయపాలెం మండలం బంధంపల్లి– హస్నాబాద్ 4.03 కి.మీ.కి రూ.4.5 కోట్లు, మేడిదపల్లి– బీరోలు వరకు 1.90 కి.మీ.కు. రూ.1.87కోట్ల వ్యయంతో బీటీ రహదారి నిర్మించనున్నారు.

మా బాధలు తీరినట్లే..



మాది కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీ. మా పంచాయతీ నుండి గట్టుసింగారం, గన్యాతండాకు ఉన్న లింకుదారులు అధ్వానంగా ఉన్నాయి. గత 15 ఏళ్ల నుంచి ఈ రోడ్లు బాగు చేయాలని కోరుతూనే ఉన్నాం. ఇప్పుడు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కృషి వల్ల మా తండాకు రూ.2.65 కోట్లతో రెండు బీటీ రోడ్లు మంజూరయ్యాయి. ఇక మా బాధలు తీరిపోతాయి.

– బానోత్ నాగేశ్వరరావు, సర్పంచ్, లింగారాంతండా

పొలాలకు వెళ్లడానికి ఇక్కట్లు



మా చేలు లింగారాంతండా శివారుల్లో ఉన్నాయి. మేం గట్టుసింగారం నుండి డొంక దారిలో మాచేలకు రెండు కిలోమీటర్ల వరకు వెళ్లాలి. వాన వస్తే నానా ఇబ్బందులు పడుతూ చేలకు వెళుతున్నాం. ఇప్పుడు ఈ దారిని బీటీగా మారుస్తున్నారు. మాకష్టాలు తొలగుతాయి.

– శీలం ఉపేందర్, గట్టుసింగారం

మద్యం టెండర్లు ఆపాలని నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు



అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: మద్యం టెండర్లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం మద్యం డ్రా జరిగే సీక్వెల్ రిసార్ట్స్ ముందు పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. దీంతో పోలీసులు నిరసన తెలుపుతున్న కార్యకర్తలను అరెస్ట్ చేసి వనటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ అని చెప్పి తాగుబోతు తెలంగాణగా మార్చారని, యువకులు, సైతం మద్యం తాగి ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారని వారి కుటుంబాలు నాశనమైపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి, జిల్లా కార్యదర్శి రూస్సీ, నాయకులు రాకేష్, ఆవుల మంగతాయి, గోకినపల్లి సరోజిని, చైతన్య, భారతమ్మ, షాను, యశోదమ్మ, సుజాత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘భగీరథ’ కార్మికుల రిలే దీక్షలు ప్రారంభం



దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఖమ్మంఅర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ జిల్లా మిషన్ భగీరథ కార్మికుల ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల నుంచి అనేక సమస్యలపై పోరాటాలు చేస్తున్నప్పటికీ అధికారులు ఎల్‌ఎన్‌టీ కంపెనీ యాజమాన్యం వారు పట్టించుకోవట్లేదని తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని కార్మికులు తెలిపారు. మిషన్ భగీరథ కార్మికులకు రాష్ట్రవ్యాప్తంగా జీఓ 60 అమలు చేయాలని, థర్డ్ పార్టీ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలన్నారు. వారాంతపు సెలవులు పండుగ సెలవులు ఇవ్వాలని, ప్రతీనెల 5లోపు వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలన్నారు. కార్మికులకు రక్షణ పరికరాలు, డ్రెస్ కోడ్ అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ రిలే దీక్షలను ఉద్దేశించి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు భూక్యా వీరభద్రం పాల్గొని సంఘీభావం వ్యక్తం చేసి మాట్లాడారు. ఈ దీక్షలో మిషన్ భగీరథ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నం వెంకయ్య, ప్రధాన కార్యదర్శి పాపగంటి రాంబాబు, పల్ల మధుసూదన్ రెడ్డి, జక్కుల యాదగిరి, అబ్బురి రవి, నాగేశ్వరరావు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యారంగ సమస్యలు పట్టించుకోకుండా ప్రభుత్వం ఎన్నికల కోసం ఆరాటపడుతుందని, తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. రూ.5177 కోట్ల పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కొత్త కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, గురుకులాలకు, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, రాజు, సహాయ కార్యదర్శులు సాయి శేషు, వీరేందర్, సరళ, సభ్యులు రాగిణి, సంగీత, నవ్య, నాగలక్ష్మి, నాయకులు వెంకటేష్, దత్తు, స్వామి, నవ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

‘ఫ్రెండ్లీ పోలీస్ అంటే థర్డ్ డిగ్రీనా?’



నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే గిరిజన మహిళలపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడమేనా అని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోడ నాగేశ్వరావు, గుగులోత్ పటేల్ అన్నారు. హైదరాబాద్‌లో గిరిజన మహిళ లక్ష్మీబాయి గమ్యస్థానం చేరుకోవడానికి వాహనం కోసం చూస్తుండగా పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ సోమవారం ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హైదరాబాద్‌లో పోలీసులు అకారణంగా లక్ష్మీబాయి అనే ర్డ్ డిగ్రీ ప్రయోగించారని, దాడి చేసిన పోలీసులను, సంబంధిత అధికారులను విధుల నుంచి సస్పెండ్ చేయడం కాకుండా పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాల సందీప్, ప్రశాంతి, స్వాతి, సుజాత, రాంనర్సయ్య, బోడ వీరన్న, చందర్‌లాల్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి.. ఇద్దరికి గాయాలు

నేలకొండపల్లి: రెండు వేర్వేరు ఘటనల్లో బైకులు అదుపుతప్పి కిందపడి ఇద్దరికి గాయాలైన ఘటనలు మండలంలో సోమవారం చోటుచేసుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చిలుకూరుకు చెందిన శశిప్రీతమ్ ఖమ్మంలోని ఓ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లుండగా మండలంలోని పైనంపల్లి జాతీయ రహదారి పనుల్లో నిర్మాణంలో ఉన్న టోల్‌గేట్ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో శశిప్రీతమ్‌కు తీవ్రగాయాలు అవ్వగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అదేవిధంగా మండలంలోని బైరవునిపల్లికి చెందిన జి.నాగేశ్వరరావు నేలకొండపల్లికి బైక్‌పై వస్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలవ్వగా స్థానికులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బీజేపీలో చేరిన వార్డు సభ్యుడు

నేలకొండపల్లి: పాలేరు బీసీ జేఏసీ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ బీజేపీలో చేరారు. మండలంలోని కొత్తకొత్తూరుకు చెందిన ఆయన ప్రస్తుతం గ్రామపంచాయతీ వార్డు సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఇటీవల ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర సహాయ మంత్రి కిషన్ రెడ్డి సమక్షాన ఆ పార్టీలో చేరగా సోమవారం విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లో పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి



ఖమ్మంమయూరిసెంటర్: శంకుస్థాపన చేస్తున్న మంత్రి పువ్వాడ..

ఖమ్మంమయూరిసెంటర్: నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజల కోసం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధిని వేగవంతం చేశామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. నగరంలోని 27, 56, 6వ డివిజన్లలో సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు.

మట్టి గణపతి విగ్రహాలతో హితం

ఖమ్మంగాంధీచౌక్: పర్యావరణాన్ని కాపాడే మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో కలకత్తా కళాకారులు దిలీప్ కుమార్ బృందం ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల విక్రయశాలను సోమవారం మంత్రి పువ్వాడ అజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఆర్జేసీ కృష్ణ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

రఘునాథపాలెం: ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని సూర్య తండా సర్పంచ్ ఆంగోత్ సక్రు మృతి కుటుంబాన్ని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సోమవారం పరామర్శించారు. సుడా చైర్మన్ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ ప్రియాంకతో పాటు అజ్మీరా వీరునాయక్, అఫ్జల్, మద్దినేని వెంకటరమణ, మెంటం రామారావు, ప్రదీప్, మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో మళ్లీ గెలుపు నాదే..



కందాలకు స్వీట్లు తినిపిస్తున్న కార్యకర్తలు

కూసుమంచి: పాలేరు ప్రజల ఆశీస్సులుతో వచ్చే ఎన్నికల్లో మళ్లీ తానే గెలుస్తానని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. కందాలకు టికెట్ కేటాయించడంతో సోమవారం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఆయన్ని కలిసి స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మీద నమ్మకంతో రానున్న ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కలిసికట్టుగా పనిచేసి నమ్మకాన్ని నిలబెట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అందరినీ కలుపుకుని ముందుకు పోతామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కందాలకు అభినందన..

నేలకొండపల్లి: పాలేరు బీఆర్‌ఎస్ టిక్కెట్‌ను కందాల ఉపేందర్‌రెడ్డికి కేటాయించిన సందర్భంగా సోమవారం డీసీఎంఎస్ డైరెక్టర్, పైనంపల్లి సొసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం, స్వీట్లను అందించి అభినందించారు. నాయకులు కుక్కల సామేల్, పెదెల్లి సిద్దయ్య, తాళ్లూరి సత్యనారాయణ, యర్రా కోటి, షేక్ మౌలానా తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో బాణాసంచాలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు.

వ్యవసాయ గణన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

నేలకొండపల్లి: పంటల నమోదు, వ్యవసాయ గణనపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని కూసుమంచి ఏడీఏ ఎస్.విజయచంద్ర సూచించారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ విస్తీరణాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ 2021 గణనను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, మండలంను వందశాతం పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. పంచాయతీలో టేకు మొక్కలు నాటించే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. హరితహారం లక్ష్యం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ డి.అరుణకుమారి, వ్యవసాయ అధికారులు యం.దుర్గాభవాని, శిరీష, యం.రామకృష్ణ, నిఖిల, సాయి, ఉదయ్‌కిరణ్, అవినాష్, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన రెండో ఏఎన్‌ఎంలు



బోనాలతో రెండో ఏఎన్‌ఎంలు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు అందరినీ బేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న ఏఎన్‌ఎంలు సోమవారం బోనాలు ఎత్తుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు మాట్లాడుతూ... రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలన్న ఏకైక డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తుండగా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు వారి డిమాండ్లపై అలసత్వం వహిస్తోందన్నారు. నోటిఫికేషన్ వద్దని రెగ్యులరైజేషన్ చేయాలని ఏఎన్‌ఎంలు డిమాండ్ చేస్తుంటే నోటిఫికేషన్ లో కొన్ని సవరణలు చేసి మళ్లీ విడుదల చేయడం సమంజసం కాదన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు మాట్లాడుతూ... నోటిఫికేషన్ విషయంలో ఏఎన్‌ఎంలకు అభ్యంతరాలు ఉన్నాయని రాబోయే రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ జావిద్, డీసీసీ మహిళా విభాగ అధ్యక్షురాలు దెబ్బల సృజన తదితరులు మద్దతు ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి యునిజ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సిహెచ్.విజయకుమారి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తమ్మరపు జయమ్మ, శీలం నాగేశమ్మ, లలితకుమారి, అరుణ, నాగమణి, శైలజ, రజిని పాల్గొన్నారు.

అమరులకు నివాళి



నివాళులర్పిస్తున్న సేనాపతి, తదితరులు

తిరుమలాయపాలెం: గద్దర్, జహీర్‌ఆలీ ఖాన్‌ల సేవలు మరవలేనివని దొడ్డి కొమరయ్య సినిమా డైరెక్టర్ ఎం.సేనాపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో ఏర్పాటుచేసిన అంబేద్కర్, గద్దర్, జహీర్‌ఖాన్ సంతాప సభలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమ్ము శ్రీను, ప్రసాద్, ఉపేందర్, కోటయ్య, వెంకన్న, వీరమ్మ, రమ, శంకర్, రమేష్, రజిత, విజయ్, ముత్తయ్య పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: బార్ షాపు వద్ద ఇద్దరు యువకులు ఘర్షణ పడగా గాయాలయ్యాయి. ఈ ఘటనపై సోమవారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే కె.ఉదయ్‌కుమార్, మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేసే వి.భవానీశంకర్ ఆదివారం మధ్యాహ్నం బార్‌కు వెళ్లారు. అక్కడ మద్యం తాగే సమయాన గొడవ జరగగా, తర్వాత బయటకు వెళ్లి కూడా గొడవ పడుతూ బీర్ సీసాలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా పరస్పరం చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు



ఖమ్మంమయూరిసెంటర్: బాణాసంచా కాలుస్తున్న కార్యకర్తలు



ఖమ్మంలీగల్: స్వీట్లు పంచుకుంటున్న న్యాయవాదులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఖరారు చేయడంపై పార్టీ కార్యకర్తలు, నాయకులు, పువ్వాడ అభిమానులు సంబురాలు నిర్వహించారు. సోమవారం నగరంలోని వీడీవోస్ కాలనీ క్యాంపు కార్యాలయంలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, ఆర్‌జేసీ కృష్ణ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పడాల నాగరాజు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా పాల్గొన్నారు.

ఖమ్మంలీగల్: పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఖమ్మం అసెంబ్లీ స్థానాన్ని కేటాయించడం పట్ల బీఆర్‌ఎస్ లీగల్ సెల్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఖమ్మం కోర్టులో బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు స్వీట్లు పంపిణీ చేశారు.

ఖమ్మంగాంధీచౌక్: గాంధీచౌక్ సెంటర్‌లో కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్త వెంకటేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.